క్లుప్తంగా

దివ్యాంగుడు జాఫర్‌తో ఎమ్మెల్యే నాని



దివ్యాంగుడు జాఫర్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్‌: ఆయన తమపై చెయ్యి వేస్తే చాలు.. ఆప్యాయంగా మాట్లాడి భుజం తడితే.. ఆనందోత్సాహంతో తేలియాడుతారు.. ఎమ్మెల్యే ఆళ్ల నాని క్రేజ్ అలాంటిది.. ఏలూరు క్యాంపు కార్యాలయం వద్ద ఇదే తరహాలో ఏలూరు లంకపేటకు చెందిన ఎండీ జాఫర్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో ఎమ్మెల్యే నాని వద్దకు వచ్చాడు. జాఫర్ దివ్యాంగుడు కావటంతో కిందనే ఉండిపోయాడు. అతడ్ని గుర్తించిన ఎమ్మెల్యే నాని వెంటనే వెళ్లి అతడ్ని ఆప్యాయంగా పలుకరిస్తూ.. ప్రేమగా మాట్లాడారు. భుజం తడుతూ పార్టీ కండువా కప్పటంతో జాఫర్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. జై జగన్.. జై ఎమ్మెల్యే ఆళ్ల నాని అంటూ సంతోషం వ్యక్తం చేశాడు.

జగన్‌తోనే ప్రజల భూమికి భద్రత

బుట్టాయగూడెం: ప్రజల భూమికి భద్రత కల్పించడమే సీఎం జగన్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం సాయంత్రం దుద్దుకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై నారా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ చేస్తున్న విష ప్రచారం సరికాదన్నారు. భూ యాజమాన్య హక్కుల చట్టంలో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. భూ కొనుగోలు దారుల రక్షణకే ఈ చట్టాన్ని తీసుకొచ్చారని తెలిపారు. భూ రిజిస్ట్రేషన్ కోసం భూ టైటిలింగ్ ఆఫీసర్‌ను నియమిస్తారన్నారు. తహసీల్దార్ భూ టైటిల్ ఆఫీసర్ పర్యవేక్షణలో భూమి హక్కులను పరిశీలించి భూమిని కొనుగోలు చేసే యజమానికి ప్రభుత్వ హామీతో రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పారు. ఇప్పుడున్న పదుల సంఖ్యలో రికార్డులు అవసరంలేదని, భూమి హక్కులపై ప్రభుత్వం హామీ ఇవ్వడం వల్ల ఎటువంటి తేడా వచ్చినా భూ ఇన్సూరెన్స్ చట్టం ద్వారా ఆ యజమానికి నష్ట పరిహారం చెల్లిస్తారని వివరించారు. ప్రతి భూమి చుట్టూ హద్దులు నిర్ణయించేందుకే గతేడాది నుంచి ప్రతి గ్రామంలో సమగ్ర భూ సర్వే జిల్లా కలెక్టర్, తహసీల్దార్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇది రైతు, భూ యాజమాన్య భరోసా కోసం స్వాతంత్య్రం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా చేపట్టిన సమగ్ర సర్వే అని వివరించారు. దీనిపై కావాలనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియాలు కుట్ర పూరిత ఆలోచనలు చేస్తూ ఐవీఆర్‌ఎస్ సర్వేలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఈ విధానాలు మానుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

- ఆదుకున్న జగన్ ప్రభుత్వం
- 32,672 మందికి రూ.74.82 కోట్ల లబ్ధి
- ఏలూరు నియోజకవర్గంలో హర్షం

ఏలూరు (టూటౌన్‌): ఆపద వేళ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఆదుకుంది. ఆసరా పథకంతో వారు స్వయం సమృద్ధిని సాధించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేశారు. ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, సున్నావడ్డీ, అమ్మఒడి వంటి పథకాల ద్వారా మహిళా సాధికారతకు కృషి చేశారు. 2019లో ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను పూర్తిగా మాఫీ చేశారు. క్రమం తప్పకుండా ప్రతి ఏటా ఆ మొత్తాన్ని విడతల వారీగా మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ వచ్చారు. ఏలూరు నియోజకవర్గంలో నాలుగు విడతలో వైఎస్సార్ ఆసరా పథకంలో ఇప్పటి వరకూ 32,672 మంది డ్వాక్రా మహిళలకు రూ.74.82 కోట్ల లబ్ధి చేకూరింది. హామీని నిలబెట్టుకున్న సీఎం జగన్‌కు డ్వాక్రా మహిళలు నీరాజనాలు పలుకుతున్నారు.

రూ.74.82 కోట్ల లబ్ధి

ఏలూరు నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్ ఆసరా పథకంలో డ్వాక్రా గ్రూపులకు చెందిన 32,672 మంది మహిళలకు రూ.74,82,58,231 లబ్ధి చేకూరింది. ఇప్పటికే నాలుగు విడతల్లో ఆసరా పథకంలో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆసరాతో ఏలూరు నియోజకవర్గంలో సగటున రూ.18.70 కోట్లు చొప్పున, ఒక్కో మహిళలకు ఒక్కో విడతలో సగటున రూ.9,500 లబ్ధి చేకూరింది.



సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

జగన్‌కు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ సొమ్ము ఆసరా పథకం పేరుతో క్రమం తప్పకుండా అందించారు. నాలుగు విడతల్లో జమ చేసిన ఆసరా సొమ్ము మాకు అక్కరకు రావడం సంతోషం. నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– కొమ్మూరి అరుణ, డ్వాక్రా మహిళ, ఏకేజీ సెంటర్, 43వ డివిజన్

సీఎంకు కృతజ్ఞతలు



ఎన్నికల హామీలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారు. మహిళలకు ఆయన అందిస్తున్న సహకారం మరువలేనిది. బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి, ఆసరా, అమ్మఒడి, సున్నా వడ్డీ పథకాల ద్వారా అందిస్తున్న సాయంతో మహిళలంతా ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– మణ్యం జ్యోతి, డ్వాక్రా మహిళ, కునిశెట్టివారి వీధి, 43వ డివిజన్

దళారీ వ్యవస్థకు చెక్ పెట్టాం

- సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువ చేశాం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్‌: రాష్ట్రంలో పేదవర్గాల ప్రజలకు అత్యుత్తమ స్థాయి పాలన అందిస్తూనే.. మరో వైపు దళారీ వ్యవస్థ, అవినీతి, లంచాలు లేని సేవలను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతుగా నిలవాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని కోరారు. ఏలూరు నగరంలోని 27, 28, 29, 30, 31, 32 డివిజన్లలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే నాని ఎన్నికల ప్రచారం చేశారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తోపాటు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి ప్రచారం చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో సీఎం జగనన్నకు తోడుగా నిలుస్తూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. మహిళలు, ప్రజలతో మమేకం అవుతూ ప్రచారం చేశారు.

మోసపూరిత బాబును నమ్మొద్దు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని ప్రచారం వాహనంపై నుంచి మాట్లాడుతూ చంద్రబాబు తన హయాంలో ప్రజలను దారుణంగా మోసం చేశారని, మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు మేనిఫెస్టో రూపంలో ముందుకు వస్తున్నారని, ప్రజలు ఎవరూ నమ్మవద్దని కోరారు. 2014 నుంచి 2019 వరకు పాలనలో చంద్రబాబు రూ.1.64 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజలకు ఎందుకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ప్రశ్నించారు. అప్పులు చేసిన లక్షల కోట్లు సొమ్ములు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కానీ 2019 నుంచీ అధికారం చేపట్టిన జగనన్న ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశారని, చేసిన అప్పులో ప్రతి రూపాయికి లెక్కలు ఉన్నాయని, ప్రజలకు నేరుగా సొమ్ములు బ్యాంకు ఖాతాల ద్వారా అందించామని వివరించారు. మరోసారి అధికారంలోకి వస్తే మరింత సంక్షేమం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ ను, ఎమ్మెల్యేగా తనను ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి విజయాన్ని అందించాలని కోరారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు మేలు

నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని ఈ ఐదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చేశామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో, ఎమ్మెల్యే ఆళ్ల నాని అండతో ప్రజలకు సేవలు అందించామని తెలిపారు. పేదవర్గాల ప్రజలకు మేలు జరగాలంటే ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో పార్టీ నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ ఖైసర్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు పోతర్లంక లక్ష్మణ్, నాయకులు బనిశెట్టి పూర్ణచంద్రరావు, భోట్ల హరిప్రసాద్, బుద్దే రాజ, జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎన్‌వీ శివరావు, చల్లా తిరుమలేశ్వరరావు, రేఖపల్లి నారాయణ, పార్టీ నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



టూటౌన్‌లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్



ఏలూరులో ఎన్నికల ప్రచారానికి హాజరైన మహిళలు

మజ్జిగ చలివేంద్రం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి సమీపంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం వైద్యుడు వజ్రకిరణ్ ప్రారంభించారు.

గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం



తిమ్మారావుగూడెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న అబ్బయ్యచౌదరి



మొండికోడులో బైక్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి





ఎన్నికల మేనిఫెస్టో పరిశీలిస్తున్న వృద్ధురాలు, 15 డివిజన్‌లో కరపత్రాలు పంచుతున్న నాయకులు

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కారుమూరి సునీల్ కుమార్, ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరిల విజయం కోరుతూ ఏలూరు రూరల్ గ్రామాలు, కాలనీల్లో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిమ్మారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి ప్రచారం చేశారు. ఏలూరు నగరం 15 డివిజన్‌లో కార్పొరేటర్ తంగెళ్ల రాము ఆధ్వర్యంలో యువతీ, యువకులు క్రాంతికాలనీ, నెహ్రూకాలనీ, మహేశ్వరికాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎన్నికల హామీ పత్రాలను ఓటర్లకు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లేయాలని అభ్యర్థించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	94
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	04-06
బెండకాయలు	28	కంద	64
పచ్చిమిర్చి	54	బీట్‌రూట్	36
కాకర కాయలు	30	కీరా దోస	34
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	160
బీరకాయలు (పందిరి)	48	అల్లం	170
క్యాబేజీ	34	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34-48	పాలకూర	12
దొండకాయలు	30	చుక్కకూర	12
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
ఆనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	38

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	20.15	4802	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు -తిరుపతి	16.00	4830	29

ముస్లిం మైనార్టీల సంక్షేమమే లక్ష్యం



వన్‌టౌన్‌లో వర్తక సంఘం నాయకులతో ఎమ్మెల్యే నాని



సమావేశానికి హాజరైన మేక మాంసం వర్తక సంఘం సభ్యులు

ఏలూరు టౌన్‌: ముస్లిం మైనార్టీ వర్గాలపై ప్రేమాభిమానాలతో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ముస్లింల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచే సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు వన్‌టౌన్ 9వ డివిజన్‌లోని జమాతుల్ ఖురేష్ మేక మాంసం వర్తక సంఘం ఆధ్వర్యంలో సంఘ భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశానికి నాని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముస్లింలకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ముస్లిం మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందనీ, మరోసారి ముస్లిం మైనార్టీలకు మంచి జరగాలంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఏలూరులో ముస్లిం సోదరులకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు ఇలియాస్ పాషా, సబ్బన శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ముస్లిం మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు రియాజ్ ఆలీఖాన్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ ఖైసర్, పార్టీ నాయకులు లంకలపల్లి గణేష్, సంఘం నాయకులు ఎండీ బాబుల్, ఎండీ సలీమ్, ఎండీ షాజహాన్, షేక్ మున్నా, ఎండీ ఆజ్మ, ఎండీ హఫీజలీ తదితరులు ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థలో పారదర్శక పాలన



రాజీనామా చేసిన వలంటీర్లతో ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్‌: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చి పారదర్శక పాలన అందించారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. 15వ డివిజన్‌లో స్వచ్ఛందంగా రాజీనామా చేసిన 12 మంది వలంటీర్లు ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే నానిని కలిశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ వలంటీర్ల త్యాగం స్ఫూర్తిదాయమకని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏలూరు పర్యటనలో జనసేన నాయకులు పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా చేస్తున్నట్లు చిత్రీకరించి వలంటీర్ల మనోభావాలని దెబ్బతీశారని, చంద్రబాబు ఏకంగా గోనెసంచులు మోసుకెళ్లే ఉద్యోగం అంటూ హేళన చేశారని గుర్తుచేశారు. ఇదే వ్యక్తులు నేడు వలంటీర్లకు జీతాలు పెంచుతామని హామీలు ఇస్తే ఎవరైనా నమ్ముతారా ? అంటూ నిలదీశారు. వలంటీర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా టీడీపీ కూటమి వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్పొరేటర్ తంగెళ్ల రాము, పార్టీ నాయకులు డెక్కత జయరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలతో ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్‌: రాష్ట్ర విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాల్లోని పిల్లలకు విద్యను మరింత చేరువ చేయటంలో ప్రభుత్వం విశేష కృషి చేసిందని ఏలూరులోని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. నాని మాట్లాడుతూ స్వాతంత్య్రం సిద్ధించిన నాటి నుంచీ విద్యా వ్యవస్థలో ఎన్నడూలేని విధంగా వినూత్నమైన మార్పులు జరిగాయని, పేదలకు నాణ్యమైన విద్యను చేరువ చేశారని గుర్తు చేశారు. విద్యార్థుల బంగారు భవితకు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ సీబీఎస్‌సీ సిలబస్ అందరికీ అందేలా ఇంగ్లిష్ మీడియం విద్యను తీసుకువచ్చారని చెప్పారు. పేదవర్గాల పిల్లలు సైతం భవిష్యత్తులో ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించేందుకు చిన్ననాటి నుంచే ఆంగ్ల విద్య ప్రవేశపెట్టటం విశేషమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను సైతం సమానంగా చూస్తూ విద్యార్థులందరికీ అమ్మఒడి పథకాన్ని అందించటం ద్వారా పేదలకు సైతం నాణ్యమైన విద్య అందించే అవకాశం ఏర్పడిందన్నారు. అమ్మవడి పథకాన్ని ప్రైవేటు స్కూల్స్‌కు వర్తింపజేయటం ద్వారా చిన్నతరహా ప్రైవేటు విద్యాసంస్థలు సైతం నిలదొక్కుకునే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే నాని చెప్పారు. ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండెపల్లి చంద్రశేఖర్, కార్యదర్శి ఎస్ఆర్‌కేఏ ప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు నగరంలోని ప్రైవేటు విద్యాసంస్థలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదవర్గాలకు చేసిన సంక్షేమ పథకాల పట్ల సంతృప్తిగా ఉన్నాయని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు రాజ్‌కుమార్, దెందులూరు అసోసియేషన్ అధ్యక్షులు తంబీ, ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు హాజరయ్యారు.